# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

శుక్రవారం /22.03.2024


# సుప్రీంకోర్టులో కవితకు ఎదురు దెబ్బ



తెలంగాణవీణ,జాతీయం

* సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవితకు చుక్కెదురు
* బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకే వెళ్లాలని ఆదేశం
* చట్టం అందరికీ ఒకటే, ప్రత్యేక విచారణ ఇక్కడ జరపలేమన్న కోర్టు

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురయింది. తనపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ ను క్వాష్ చేయాలని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... ఆమెకు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది.పిటిషనర్ ఎవరైనా సరే తాము ఏకరీతి విధానాన్ని అనుసరిస్తామని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెయిల్ కోసం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని తాము అంగీకరించబోమని తెలిపింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకే వెళ్లాలని సూచించింది. ఎవరైనా సరే బెయిల్ కోసం తొలుత కింది కోర్టుకే వెళ్లాలని స్పష్టం చేసింది. తన అరెస్ట్ చట్ట విరుద్ధమంటూ రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించి కవిత లేవనెత్తిన అంశాలను... గతంలో విజయ్ మదన్ లాల్ కేసుకు ధర్మాసనం జత చేసింది. కేవలం రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలపై మాత్రమే విచారణ జరుపుతామని తెలిపింది. ఇదే విషయంపై దాఖలైన మరో పిటిషన్ తో కలిసి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. పిటిషన్ లోని అంశాలపై ఈడీకి నోటీసులు ఇస్తామన్న ధర్మాసనం... ఈడీకి నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం కేసు మెరిట్స్ లోకి వెళ్లబోమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో కవిత తరపున ప్రముఖ సీనియర్ న్యాయవాది, రాజకీయవేత్త కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.

# హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

* దీపా దాస్ మున్షీతో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి భేటీ!
* ఇప్పటికే కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్
* ఇటీవలే రేవంత్ రెడ్డిని కలిసిన విజయలక్ష్మి

తెలంగాణవీణ,హైదరాబాద్



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ కీలక నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో పాటు పలువురు నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీ మారబోతున్నారనే వార్త పొలిటికల్ సర్కిల్ లో వైరల్ అవుతోంది. తాజాగా... నగర మేయర్, బీఆర్ఎస్ పార్టీ కీలక నేత కె.కేశవరావు కుమార్తె గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ లో చేరబోతున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కొన్ని రోజుల క్రితమే సీఎం రేవంత్ ను విజయలక్ష్మి కలిశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జీ దీపాదాస్ మున్షీతో కాసేపటి క్రితం విజయలక్ష్మి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రోహిణ్ రెడ్డి కూడా వీరితో పాటు ఉన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో, విజయలక్ష్మి కాంగ్రెస్ లో చేరబోతున్నారనే ప్రచారానికి మరింత బలం చేకూరినట్టయింది.

# టీడీపీ అభ్యర్థుల మూడో జాబితా విడుదల



తెలంగాణవీణ,ఏపీ బ్యూరో

టీడీపీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 అసెంబ్లీ స్థానాలతో పాటు 13 పార్లమెంట్ అభ్యర్థులను ఈ జాబితాలో పార్టీ ప్రకటించడం జరిగింది. పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ చేయనున్న విషయం విదితమే. దీనిలో భాగంగా ఇదివరకే 128 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పుడు మరో 11 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. కాగా, మరో ఐదు శాసనసభ, నాలుగు ఏంపీ స్థానాలను పెండింగులో పెట్టింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు షాక్.. హైకోర్టు నుంచి నోటీసులు



తెలంగాణవీణ,గద్వాల

తెలంగాణలో రాజకీయ సమీకరణాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. ఓవైపు లోక్ సభ ఎన్నికలకు సమం ఆసన్నమమవుతుంటే.. మరోవైపు నేతలంతా జంపింగ్ జపాంగ్ అవుతున్నారు. ఇక ఉన్న వాళ్లయినా సరిగ్గా ఉన్నారా అంటే.. అదీ లేదు. ఇప్పుడు ఓ ఎమ్మెల్యేకు ఏకంగా హైకోర్టు నుంచి నోటీసులు వచ్చాయి. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడి ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ.. బీఎస్పీ అభ్యర్థి ఆర్. ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు.ప్రసన్న కుమార్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పదవికి విజయుడు రాజీనామా చేయకుండానే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని తెలిపారు. తన వృత్తికి సంబంధించిన వివరాలను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదన్నారు. రాజీనామా లేఖను, దానికి లభించిన ఆమోదం తదితర ఆధారాలు సమర్పించలేదని ఆరోపించారు. నిబంధనల ప్రకారం నామినేషన్‌కు మూడు నెలల ముందు రాజీనామా సమర్పించాల్సించాలని గుర్తు చేశారు.

# నిర్మాణంలో ఉన్న వంతెన కూలి ఒకరి మృతి..


తెలంగాణవీణ,జాతీయం



బీహార్‌లో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. సుపౌల్‌లో జరిగిందీ ఘటన. శిథిలాల కింద చిక్కుకున్న పలువురు కూలీలను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కోసి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి శ్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.


# తమిళనాడులోని పలు ప్రాంతాలను ముంచెత్తిన భారీ వర్షం

తెలంగాణవీణ,జాతీయం



భారీ వర్షం ఈ ఉదయం తమిళనాడులోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. నిన్న చెదురుమదురుగా కురిసిన వర్షం నేడు భారీగా పడడంతో తూత్తుకుడి జిల్లా సహా పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు మునిగి పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక పాదచారుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ట్రాఫిక్ కష్టాలైతే చెప్పక్కర్లేదు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ తెలిపింది. వచ్చే ఐదు రోజులు రాయలసీమ, కేరళలో తేమతో కూడిన వేడి వాతావరణం ఉంటుందని పేర్కొంది. తమిళనాడు, పుదుచ్చేరిలోని ఉత్తర ప్రాంతాల్లోనూ వచ్చే రెండు రోజుల్లోనూ ఇలాంటి వాతావరణమే ఉంటుందని వివరించింది.

# ఇస్రో పునర్వినియోగ రాకెట్ పుష్పక్ ప్రయోగం విజయవంతం




దేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న పునర్వినియోగ వింగ్డ్ రాకెట్ పుష్పక్‌ను ఇస్రో నేడు విజయవంతంగా పరీక్షించింది. కర్ణాటకలోని చిత్రదుర్గలోగల ఏయిరోనాటికల్ టెస్టింగ్ రేంజ్‌లో ఈ ప్రయోగం నిర్వహించింది. ఇందులో భాగంగా పుష్పక్ తనంతట తానుగా రన్‌వేపై ల్యాండైంది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఇస్రో చైర్మన్ కూడా హాజరయ్యారు. అంతరిక్ష రంగంలో సుస్థిరత, వ్యర్థాల తగ్గింపు దిశగా ఇస్రో గత దశాబ్దకాలంగా పుష్పక్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇది సింగిల్ స్టేజ్ టూ ఆర్బిట్ రాకెట్. అంటే.. పీఎస్ఎల్‌వీ లాగా వివిధ దశలకు బదులు ఒకే దశలో కక్ష్యలోకి చేరుకుంటుంది. ఇందులో అత్యాధునిక ఎక్స్–33 అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్, ఎక్స్–34 టెస్ట్‌బెడ్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్, ఆధునికీకరించిన డీసీ–ఎక్స్ఏ ఫ్లైట్ డెమాన్‌స్ట్రేటర్ ఉన్నాయి. పుష్పక్‌ను విజయవంతంగా ప్రయోగించడం ఇస్రోకు ఇది మూడోసారి. గతేడాది జరిపిన పరీక్షలో ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ నుంచి వదిలిన పుష్పక్.. మానవుల నియంత్రణ లేకుండా తనంతట తానుగా ల్యాండయింది. దీంతో, ఆర్బిటల్ రీఎంట్రీ సామర్థ్యం సముపార్జనలో ఒకడుగు ముందుకు వేసింది. ఇస్రో నిర్మించబోయే అంతరిక్ష స్పేస్ స్టేషన్‌కు విడిభాగాలు, వ్యోమగాముల తరలింపులో ఈ రాకెట్ కీలకం కానుంది.

రూ. 100 కోట్లతో ఇస్రో 'పుష్పక్ విమాన్' ప్రాజెక్టు చేపట్టింది. 2012లో ఈ రాకెట్ డిజైన్‌కు ఆమోదం లభించడంతో ఇస్రో ఆర్ఎల్‌వీ–టీడీ పేరిట ఓ ప్రయోగాత్మక పునర్వినియోగ రాకెట్ మోడల్‌ను రూపొందించింది. ఈ రాకెట్ సామర్థ్యాలను 2016లో తొలిసారిగా పరీక్షించారు. పునర్వినియోగ సామర్థ్యం ఉన్న రాకెట్‌తో అంతరిక్ష ప్రయోగాల్లో వ్యర్థాల విడుదల తగ్గుతుందని ఇస్రో చెబుతోంది.